క్లుప్తంగా

ఈనెల 30న పోలమాంబ హుండీల ఆదాయం లెక్కింపు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి వనంగుడి, చదురుగుడిలలో ఏర్పాటుచేసిన హుండీల ఆదాయాన్ని ఈనెల 30వతేదీన లెక్కించనున్నట్లు ఈవో వీవీ సూర్యనారాయణ బుధవారం తెలిపారు. శుక్రవారం ఉదయం 10గంటలకు రెవెన్యూ, పోలీస్‌శాఖ, గ్రామపెద్దల సమక్షంలో లెక్కింపు ప్రారంభం కానుందని ఆయన పేర్కొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



గలావల్లిలో షిర్డీసాయి ఆలయం వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దాలినాయుడు మాస్టారు

బలిజిపేట: మండలంలోని గలావల్లి గ్రామంలో షిర్డీసాయి ఆలయం వద్ద రూ.25వేలతో కూలింగ్ వాటర్ సరఫరా చేసే చలివేంద్రాన్ని రిటైర్డ్ ఎంటీఎస్ ఉపాధ్యాయుడు కె.దాలినాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి కరుణా కటాక్షాలతో, ఆలయానికి వచ్చే రాబడితోనే దీనిని ఏర్పాటుచేశామని తెలిపారు. నిరంతరం ఈ చలివేంద్రం ఉంటుందని, ప్రజలు వారి దాహార్తిని తీర్చుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామంలోని యువకులు, పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్‌కు సన్మానం



జవాన్‌ను సన్మానిస్తున్న సంజీవినాయుడు, యువకులు

బలిజిపేట: మెరకముడిదాం మండలం గాదెల మర్రివలస గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ ఏవీ నాయుడును పెదపెంకి నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవినాయుడు ఘనంగా సన్మానించారు. నేతాజీ గ్రంథాలయం వద్ద బుధవారం ఆయనను సన్మానించిన సందర్భంగా సంజీవినాయుడు మాట్లాడుతూ దేశానికి కిసాన్, జవాన్ చాలా ముఖ్యమన్నారు. అటువంటి జవాన్‌లను గౌరవించడం భరతమాతను గౌరవించినట్టేనన్నారు. ఎన్నో మంచి లక్షణాలు కలిగిన జవాన్ ఏవీ నాయుడు అని ప్రశంసించారు. ఈ సందర్భంగా సన్మానగ్రహీత నాయుడు మాట్లాడుతూ ఈ సన్మానం తన ఒక్కడికే కాదని, దేశాన్ని కాపాడుతున్న అందరి జవాన్ల సేవలను గుర్తించి చేసినట్లేనన్నారు. మారుమూల గ్రామంలో జవాన్లపై ఇంతటి ప్రేమాభిమానాలు చూపిన వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కె.భాస్కర్, పవన్, మధు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద ప్రదేశాల పరిశీలన



క్వారీ వద్ద పరిశీలిస్తున్న రూరల్ ఎస్సై బి.సంతోషి కుమారి

పార్వతీపురం రూరల్: మండలంలోని పలు గ్రానైట్, క్వారీల వద్ద అలాగే మరికొన్ని అనుమానాస్పద ప్రదేశాలలో పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి కుమారి తన సిబ్బందితో కలిసి బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలోని క్వారీలలో ఉపయోగించే పేలుడు పదార్థాలతో వెళ్తున్న వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అడ్డగించి కొన్ని కేజీల పేలుడు పదార్థాలను అపహరించడంతో ఈ ఘటనను ఉద్దేశించి తనిఖీలు నిర్వహించినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ మేరకు మండల పరిధిలో ఉన్న క్వారీలను అలాగే అనుమానాస్పద ప్రదేశాలను పరిశీలించి తనిఖీ చేశామన్నారు.

జంఝావతి సాధన కోసం ర్యాలీలు రేపు

కొమరాడ: జంఝావతి ప్రాజెక్టు పూర్తి స్థాయి సాధన కోసం ఈ నెల 30న జంఝావతి సాధన సమితి ఆధ్వర్యంలో జల హారతి బైక్ ర్యాలీలు పరిసర ప్రాంతాల గ్రామాల్లో గురువారం నిర్వహించనున్నట్టు సమితి కన్వీనర్ మరిశర్ల మాలతి కృష్ణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం జంఝావతి ప్రాజెక్టు ఆవరణలో జల హారతి ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ర్యాలీ పార్వతీపురం నుంచి శివిని, విక్రంపురం, ఆర్తాం, స్వామినాయుడువలస, గంగారేగువలస, రాజ్యలక్ష్మీపురం, కంబవలస, కోనవలస తదితర ప్రాజెక్టు సమీప గ్రా మాల్లో ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. ర్యాలీల్లో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఫైర్ సిలిండర్ వినియోగంపై అవగాహన తప్పనిసరి

వీరఘట్టం: గ్యాస్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందితో పాటు డెలివరీ బాయ్స్ తప్పనిసరిగా ఫైర్ సిలిండర్ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక అగ్నిమాపక కేంద్రం ఇన్‌స్పెక్టర్ జామి సర్వేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక భారత్ గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తున్న సిబ్బందికి అవగాహన కల్పించారు.

జాతర విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్/పార్వతీపురం రూరల్:

పార్వతీపురంలో జూన్ 1,2,3 తేదీల్లో నిర్వహించే ఇప్పల పోలమాంబ జాతరను సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ మేరకు జాతర నిర్వహణపై సంబంధిత అధికారులు, కమిటీ సభ్యులతో బుధవారం ఆయన కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పల పోలమాంబ జాతరకు పెద్దఎత్తున భక్తులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. జాతర జరిగే మూడు రోజులూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా, సజావుగా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జాతరకు విచ్చేసే భక్తులకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పన ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. ఇతర జిల్లాల నుంచి భక్తులు రానున్న నేపథ్యంలో అందుకు తగినట్లు ఆర్టీసీ బస్సులను నడపాలని కోరారు. పురపాలక సంఘం, విద్యుత్, పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇతర శాఖల అధికారులు నిత్యం పర్యవేక్షిస్తుండాలని సూచించారు. అనుకోని సంఘటనలు ఏర్పడితే తక్షణమే స్పందించేలా క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు.

శాంతిభద్రతలకు భంగం వాటిల్లరాదు

జాతరకు వచ్చే బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాల పార్కింగ్ కోసం గుర్తించిన స్థలాలను సిద్ధం చేసుకోవాలని, సిరిమాను తిరిగే ప్రాంతాలతో పాటు అన్ని ముఖ్య ప్రాంతాల్లో గట్టి పోలీసు బందోబస్తుతో పాటు రోప్ పార్టీలను సంసిద్ధం చేయాలని పోలీస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వేసవి దష్ట్యా పలు ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటుచేసి చల్లని తాగునీరు, మజ్జిగ వంటివి పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లోటల్టేజీ సమస్య తలెత్తకుండా అవసరమైన ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటుచేయాలని, సిరిమాను తిరిగే సమయంలో విద్యుత్‌ను నిలిపివేయాలని ఆదేశించారు. జాతరలో పారిశుధ్యం ప్రధానమని, పరిశుభ్ర వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వృథా అయిన ఆహార పదార్థాలు, వ్యర్థాలను ప్రజలు రహదారులపై పారబోయరాదని కోరారు. అవసరం మేరకు డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయనున్నామని వాటిలో మాత్రమే వేయాలని సూచించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలని, అంబులెన్సులు, మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధం చేసుకోవాలని వైద్య సిబ్బందికి కలెక్టర్ స్పష్టం చేశారు. అగ్ని మాపక వాహనం సిద్ధంగా ఉండాలని చెప్పారు. సమన్వయంతో జాతరను విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి టి.కొండలరావు, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా.ఎస్.భాస్కరరావు, పోలీస్ అధికారులు, కమిటీ సభ్యులు బెలగాం జయబాబు, రమణ, అధికారులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ఎంపీడీవో కార్యాలయంలో యోగా చేస్తున్న అధికారులు

మక్కువ: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఈవోపీఆర్డీ పి.దేవకుమార్ తెలిపారు. ఈ మేరకు స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు పాల్గొని, యోగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ దేవకుమార్ మాట్లాడుతూ యోగా అన్నది సున్నితమైన వ్యాయమమని, శ్వాసనియంత్రణ, ధ్యానంతో అభ్యాసం చేయాలన్నారు. క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల, రక్తపోటు తగ్గడంతో పాటు, రక్తప్రసరణ మెరుగుపడుతుందన్నారు. అనంతరం దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో పెంట సత్యనారాయణ, ఉపాధ్యాయులు, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యంత్రాలు కొనడం కాదు..వినియోగం చూపించాలి



ఏఎంసీలో యంత్రాలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పార్వతీపురం: పార్వతీపురం ఐటీడీఏ నిధులతో యంత్రాల కొనుగోలులో చూపిన ఆసక్తి వాటి వినియోగంలో చూపడం లేదని కాంగ్రెస్ పార్టీ నాయకుడు వి.దాలినాయుడు, టి.గౌరీశంకరరావులు అధికారుల తీరును ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని ఏఎంసీ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న జీడిపిక్కల ఫ్యాక్టరీ పనులను, ఏర్పాటు చేసిన యంత్రాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడిపిక్కల సీజన్ అయిపోయిన తరువాత ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు యంత్రాలు తెప్పించడం, వాటి నిర్వహణకు అరకొరగా జీడిపిక్కలను కొనుగోలు చేయడం హస్యాస్పదంగా ఉందన్నారు. ప్రాసెసింగ్ యంత్రాలను కొనుగోలు చేయడం సంతోషకరమైనప్పటికీ వాటిని వినియోగంలోకి తేవాలని కోరారు.

మైక్రో క్రెడిట్ రుణాలకు సంఘ సభ్యుల రిజిస్ట్రేషన్



చినభోగిలిలో పొదుపు సంఘం సభ్యుల పేర్లు రిజిస్ట్రేషన్ చేస్తున్న సీసీలు

సీతానగరం: మండలంలో వెలుగు సమాఖ్య పరిధిలో 1110 సంఘాలకు వార్షికరుణ ప్రణాళికలు తయారుచేయనున్నామని వెలుగు ఏపీఎం రెడ్డి శ్రీరాములు అన్నారు. ఈ మేరకు మండల వెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో పొదుపు సంఘాలకు రుణప్రణాళికల తయారీకి రిజిస్ట్రేషన్ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో మైక్రో క్రెడిట్ ప్లాన్ ద్వారా రుణాలు అందజేయనున్నట్లు తెలియజేశారు. అర్హులైన వారందరికీ రుణాలు సమకూర్చడానికి సిద్ధం చేశామని అందుకు అవసరమైన వివరాలు పొందుపరచనున్నట్లు తెలిపారు. ఈ మేరకు గ్రామాల్లో రుణాలకు అర్హులైన వారి వివరాలను సీసీలు రిజిస్ట్రేషన్ చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో పాపమ్మవలస, చినభోగిలి,పెదభోగిలి, అప్పయ్యపేట, అంకాలం గ్రామాల్లో సీసీ రిజిస్ట్రేషన్ పనులు చేపడుతున్నారన్నారు.

బిల్లులందక గోశాలల లబ్ధిదారుల ఆందోళన



కరాసవలస రహదారిలో నిర్మాణం పూర్తయిన గోశాల

సాలూరు రూరల్: మండలంలోని గోశాలలు కేవలం కూటమి కార్యకర్తలకే కేటాయించారని గోవులు ఉన్న రైతులకు కాకుండా గోవులు లేని వారికి కూడా గోశాలలు మంజూరు చేశారన్న ఆరోపణలతో మండల సమావేశాల్లో సర్పంచ్‌లు అధికారులను నిలదీశారు. దీనిపై కనీసం సర్పంచ్‌ల తీర్మానాలు కూడా లేకుండా ఇష్టారాజ్యం గోశాలలు కేవలం అధికార పార్టీ అనుచరులకే మంజూరుచేశారన్న ఆరోపణలు చేశారు. అయితే తీరా గోశాలలు మండలంలో ప్రతి పంచాయతీలోని రైతులు నిర్మాణాలు చేపట్టారు. అందులో చాలావరకు టీడీపీ నాయకులు వారి అనుచరులే కావడంతో బిల్లులు మంజూరు కాకపోయినా ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తుందని బయటకు చెప్పలేక మింగలేక వారిలో వారు మధనపడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. లక్షల రూపాయలు అప్పులు చేసి గోశాలలు నిర్మాణాలు చేశామని అప్పులకు వడ్డీలు కట్టాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు.

నీళ్ల ట్యాంక్‌లు నిర్మించి..నీళ్లు మరిచారు



కరాసవలసలో నిర్మాణం చేసిన పశువుల నీళ్ల ట్యాంక్

సాలూరు రూరల్: మండలంలోని పశువులు వేసవికాలంలో నీరు తాగేందుకు ప్రభుత్వం ప్రతిగ్రామానికి నీటి ట్యాంకులు మంజూరు చేసింది. అయితే కొన్ని గ్రామాల్లో కాంట్రాక్టర్లు నీళ్ల ట్యాంక్‌ల నిర్మాణం చేపట్టారు. మండు వేసవిలో ఈ ట్యాంకులు గ్రామాల్లో పశువులు నీరు తాగేందుకు ఉపయోగపడే విధంగా నిర్మించాలి. అయితే ఈ ట్యాంక్‌ల నిర్మాణం ఆలస్యంగా చేయడమే కాకుండా నిర్మాణం పూర్తయిన ట్యాంకులకు ఇంతవరకు నీరు ఇవ్వలేదు. వీధికుళాయిలనుంచి నీరు అందించే విధంగా చర్యలు చేపడతామని అధికారులు చెప్పడమే తప్ప కనీసం ఒక్క ట్యాంక్‌కు కూడా నీరు అందించిన పాపాన లేదు. ఈ లోగా వర్షాకాలం రానే వచ్చింది. నిర్మాణం చేసిన ట్యాంక్‌లు వృథాగా పోవడమేనని పలు గ్రామాల రైతులు అంటున్నారు. ఇదిలా ఉండగా ఈ నీళ్ల ట్యాంక్‌ల నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లు టీడీపీ నాయకులో? లేక కార్యకర్తలు కావడంతో బిల్లులు చెల్లించకపోయినా బయటకు చెప్పలేక మెల్లకుంటున్నారని ప్రచారంలో ఉంది.

సోషల్ మీడియా కార్యకర్తకు రాజన్నదొర పరామర్శ



సోషల్ మీడియా కార్యకర్తను పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు రూరల్: పట్టణంలోని బంగారమ్మ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త పనస జగదీష్(పండు)కు ఇటీవల సర్జరీ కావడంతో మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర బుధవారం కార్యకర్త ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. మాజీ ఉపముఖ్యమంత్రి తమ ఇంటికి వచ్చి కుమారుడి యోగక్షేమాలు అడిగి ఆప్యాయంగా మాట్లాడడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. పరామర్శలో పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, గిరిరఘు, సింగారపు ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

పోలీసు, మున్సిపల్ అధికారులకు సత్కారం



సత్కారం కార్యక్రమంలో పోలీస్, మున్సిపల్ అధికారులు

సాలూరు రూరల్: శ్యామలాంబ అమ్మవారి పండగలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చేసినందుకు పోలీస్ అధికారులు.. అలాగే పారిశుధ్యం సక్రమంగా నిర్వహించినందుకు మున్సిపల్ అధికారులను అల్లువీధి శ్యామలాంబ ఉత్సవ కమిటీ పెద్దలు బుధరం సాయత్రం సత్కరించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ బి.అప్పలనాయుడు, రూరల్ సీఐ పి.రామకృష్ణ, ఎస్సైలు శ్రీనివాసరావు, నరసింహమూర్తి మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్.బాలకృష్ణలు సత్కారం పొందారు.

ఘనంగా ఎన్‌టీఆర్ 102వ జయంతి



ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్/పార్వతీపురం రూరల్: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 102వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారిక కార్యక్రమంగా ఎన్‌టీ ఆర్ 102వ జయంతి వేడుకలను ప్రకటించిన సంగతి విదితమే. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో జయంతి వేడుకలు జరిగాయి. కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, ఎన్‌టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, కే ఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి ధర్మచంద్రారెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్, డీఆర్‌డీఏ పీడీ ఎం. సుధారాణి, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తమర్భ కొండలరావు, జిల్లా ఉద్యాన అధికారి బి.శ్యామల, పురపాలక సంఘం మాజీ వైస్‌చైర్మన్ జయబాబు, జిల్లా అధికారులు, ఎన్‌సీసీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సమైక్యతా ర్యాలీని విజయవంతం చేయండి



సీఐటీయూ కార్యాలయంలో కరపత్రాన్ని విడుదల చేసిన ప్రజాసంఘాల నాయకులు

బలిజిపేట: ఈనెల 30వ తేదీన నిర్వహించనున్న రెండు కార్యక్రమాలు సమైక్యత ర్యాలీని, తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం మండల కమిటీ తీర్మానించింది. ఈ మేరకు బలిజిపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ప్రచార కరపత్రాన్ని బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ఆర్.వేణు, మన్మథరావులు మాట్లాడుతూ 30న మతసామరస్యం, దేశ సమగ్రతకు సీపీఎం కృషిపై నిర్వహించనున్న సమైక్యతా ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. అదేరోజున పార్వతీపురం నుంచి పెద్దింపేట మీదుగా నారాయణపురం బస్సు నడపాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నామన్నారు. అలాగే వచ్చేనెల 3వ తేదీన కౌలు రైతుల సమస్యలపై తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జరుగుతుందన్నారు. వాటిని విజయవంతం చేయాలని, ఉగ్రదాడి చర్యలకు వ్యతిరేకంగా దేశప్రజల ఐక్యత సమైక్యతా స్ఫూర్తికి ఇది నిదర్శనమన్నారు. నేటి టీడీపీ ఎన్డీఏలో భాగస్వామిగా ఉంటూ బీజేపీ మతోన్మాదానికి వంత పాడుతోందని, అటువంటి పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బి.భానుమూర్తి, ఎస్.ఈశ్వరరావు, డి.త్రినాథ, జి.బలరాము, ఎ.సాంబమూర్తి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రహదారి పొడవునా గోతులే.!



గోతులతో నిండిన గుండ్రప్పవలస రోడ్డు

- మరమ్మతులు చేయాలని కోరుతున్న గుండ్రప్పవలస గిరిజనులు

సాలూరు రూరల్: గిరిజన గ్రామాలకు రోడ్ల పండగ వచ్చిందని సమావేశాల్లో ఊదరగొడుతున్న గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణికి పెద్ద పెద్ద గోతులతో దర్శనమిస్తున్న గుండ్రప్పవలస రహదారి కనిపించడం లేదా? అని ఆ గ్రామ గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని కోదుకరకవలస నుంచి గుండ్రప్పవలస గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా గోతులమయం కావడంతో వాహన చోదకులకు ఇబ్బందికరంగా మారింది. వర్షం పడితే ఈ గోతుల్లో నీళ్ల చేరి గోతిలో వాహన చోదకులు ప్రమాదాలకు గురి కావాల్సి వస్తోందని ఆయా గిరిజన గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మా గ్రామానికి రోడ్డు మరమ్మతులు చేయాలని కనీసం పెద్దగా ఉన్న గోతులు కప్పాలని గిరిజనులు కోతున్నారు.

సాగు భూమికి పట్టాలివ్వాలి

- తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న గిరిజన రైతులు

పాచిపెంట: మండలంలోని కుడుమూరు రెవెన్యూ పరిధి సర్వేనంబర్ 48లో గిరిజన రైతులు సాగు చేస్తున్న 782 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించి పట్టాలు ఇవ్వాలని బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా గిరిజన రైతులు సాగు చేస్తున్న ప్రభుత్వ భూమికి పట్టాలు మంజూరు విషయంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ భూమికి సంబంధించి సర్వే చేపట్టినప్పటికీ ఇప్పటివరకు పట్టాలు ఇవ్వకపోవడమే కాకుండా ఆ సర్వే వివరాలు కూడా బహిర్గతం చేయలేదన్నారు. ఈ ప్రభుత్వ భూమిని కొంతమంది వ్యక్తులు అన్యాక్రాంతం చేయాలని ప్రయత్నిస్తున్నారని ప్రభుత్వం తక్షణమే స్పందించి గిరిజన రైతులకు న్యాయం చేయాలని కోరారు. లేని సమక్షంలో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద వంటావార్పు చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, ఎన్‌వై నాయుడు, గిరిజన సంఘం నాయకులు సూకురు అప్పలస్వామి, జన్ని రామయ్య మంచాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు అందరికీ కల్పించాలి



ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచనలిస్తున్న ఎంపీడీవో ధర్మారావు

జియ్యమ్మవలస రూరల్: ఉపాధి హామీ పనులు గ్రామాల్లో అందరికీ కల్పించాలని ఎంపీడీవో కె.ధర్మారావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. వేతనదారులు సమయపాలన పాటిస్తూ పనులు చేపట్టేలా చూడాలని, మస్టర్ల నిర్వహణ సక్రమంగా ఉండాలని, కొలతల మేరకు పనులు చేపట్టేలా చూడాలని సూచించారు. వేతనదారుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పదని హెచ్చరించారు. సమావేశంలో ఏపీవో తులసీదాస్, జేఈ తేజ ఉన్నారు.

వేలాది మంది విద్యార్థులకు బాసటగా..

పాలకొండ రూరల్: పాలకొండ నగర పంచాయతీ పరిధిలోని ముదునూరు వీధిలో గల బెవర వేణుగోపాలనాయుడు అన్నదాన సత్రం గడచిన వందేళ్లుగా వేలాది మంది విద్యార్థులకు బాసటగా నిలిచిందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. అన్నదాత సత్రంలో వేణుగోపాలనాయుడు, వేణుగోపాలస్వామి విగ్రహాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ... వీరిద్దరూ సత్రం నిర్వహణకు ఎంతో సహకరించారని చెప్పారు. సత్రం నిర్మాణానికి భూమి కేటాయించారని తెలిపారు. కార్యక్రమంలో పాలవసల శశిభూషణరావు, గేదెల రామ్మోహనరావు, గేదెల అప్పలనాయుడు, పాలవలస ధవళేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బోరి గెడ్డపై బ్రిడ్జి నిర్మించాలి



బోరి గెడ్డ వద్ద గిరిజనులు నిర్మించిన చెక్కల వంతెనను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం మండలం బోరి(బండిగూడ) గెడ్డపై బ్రిడ్జి నిర్మించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏజెన్సీ పర్యటనలో భాగంగా బుధవారం ఆయన ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, జిల్లా సమితి సభ్యుడు మండంగి సింగన్న, గుణమ్మ, కౌసల్య తదితరులతో కలిసి గొటివాడ - బోరి గ్రామాల మధ్యనున్న చెక్కల బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ గెడ్డపై బ్రిడ్జి లేకపోవడంతో ఈ ప్రాంతంలో నివసించే అనేక గ్రామాల ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. దీనిపై బ్రిడ్జి నిర్మిస్తే రెవెన్యూ డివిజనల్ కేంద్రమైన పాలకొండకు తక్కువ సమయంలో చేరుకునే వీలు ఈ ప్రాంత ప్రజలకు కలుగుతుందన్నారు. ఎన్నికల్లో గెలిస్తే బ్రిడ్జి నిర్మిస్తామని చెప్పిన నేతలు మాట తప్పారన్నారు. ఐటీడీఏ అధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించి బోరి గెడ్డపై తక్షణమే బ్రిడ్జి నిర్మించే చర్యలు చేపట్టాలని కోరారు.